

ఆమె.. అన్నింటా..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆమె లేని సమాజాన్ని ఊహించలేం. మానవ మనుగడకు ఆమె ఆధారం. ఆమెతోనే సృష్టి పరిపూర్ణం. ఆకాశంలోనే కాదు.. అవకాశాల్లోనూ ఆమె సగం. రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మేముసైతం అంటూ నేటి మహిళలు దూసుకు పోతున్నారు. అన్ని రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. హోంమేకర్ అయినా.. అంతరిక్షంలో దూసుకెళ్లిన సునీతా విలియమ్స్ అయినా.. ఆమె పాత్ర మరువలేనిది. నేటి మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల విజయగాథలు...

5లో

రంజాన్ వేళలు

శనివారం ఇఫ్తార్ : సాయంత్రం 6.30

ఆదివారం సహర్ : ఉదయం 5.07



అక్కన్నపేట మండలం అంతకపేట ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్

మార్కెటింగ్ ఉన్న పంటలనే సాగుచేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట/హుస్నాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి లాభాలు పొందాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతువేదికలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను బలోపేతం చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న కుందనవానిపల్లిలో ఉన్న ప్రసిద్ధ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవో, డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో బానోతు జయరాం, ఏవో తస్లీమా సుల్తానా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావు, ఏఈవో శ్రీలత పాల్గొన్నారు.

లెక్కల మాస్టర్‌గా కలెక్టర్

అక్కన్నపేట మండలం అంతకపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కలెక్టర్ మను చౌదరి ఉపాధ్యాయుడిగా మారారు. పదోతరగతి విద్యార్థులకు గణితం సబ్జెక్ట్ బోధించి పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కంప్యూటర్ ల్యాబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవో రంగనాయక్ తదితరులున్నారు.

భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి, కోహెడ మండలాల్లోని సింగరాయ ప్రాజెక్టుల కాలువలకు సంబంధించిన భూ సేకరణపై శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి హుస్నాబాద్‌లోకి సమీకృత భవనంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నేషనల్ హైవే పనులు నిలిచిపోయిన చోట భూసేకరణ, హుస్నాబాద్‌లో నిర్మించబోయే పలు కార్యాలయాల భవనాల కు సంబంధించి భూసేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



15 రోజులు.. రూ.69లక్షలు!

- మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపులు

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం కానుకలు, ఒడిబియ్యం, హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయుల ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శివరామకృష్ణ భజన మండలి మహిళా సభ్యులు కానుకలను లెక్కించారు. రూ69,11,633నగదు, 46గ్రాముల బంగారం, 5.200 కిలోల వెండి, 14 క్వింటాళ్ల ఒడిబియ్యం, 14విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయి. ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల ఏడు వారాల జాతర పూర్తవగా, వేలా ది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆదాయం కేవలం 15 రోజుల్లోనే సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయశాఖ మెదక్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, తదిరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకే మొగ్గు..

- జిల్లాలో 1.97లక్షల జాబ్‌కార్డులు.. 3.95 లక్షల కూలీలు
- 12 రకాల పనులతో కూలీలకు ఉపాధి
- రోజుకు 13,761 మంది కూలీలకు పని కల్పిస్తున్న అధికారులు
- ప్రజలకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం
- సుస్థిర ఆస్తుల కల్పనకు చర్యలు



కోహెడ మండలం వేంకటేశ్వరపల్లిలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు

సిద్దిపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి); గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తికావడంతో కూలీలు ఉపాధి హామీ పనులపై ఆసక్తి చూపుతున్నారు. క్రమంగా రోజురోజుకు ఉపాధిహామీ పనులకు కూలీలు వెల్తుండడంతో వారి సంఖ్య పెరుగుతుంది. జిల్లాలో మొత్తం 1.97లక్షల జాబ్ కార్డులున్నాయి. 3.95లక్షల మంది కూలీలుగా వారి పేర్లు నమోదై ఉన్నా యి. ఫిబ్రవరి, మార్చి సీజన్‌లో కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరిలో రోజుకు 12,352 మంది కూలీలు సగటను గ్రామపంచాయతీకి 26 మంది చొప్పున హాజరయ్యారు. మార్చిలో కూలీల సంఖ్య మరింత పెరిగింది. రోజుకు 13,761 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి కాలం కాబట్టి రాబోయే రోజుల్లో కూలీల సంఖ్య రెట్టింపు కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిరుపేద కుటుంబాల జీవన విధానం పెంపొందించాలన్న లక్ష్యంతో ఉపాధిహామీపనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ఎంచుకుని అధికారులు ముందుకు వెళ్తున్నారు. జిల్లావ్యాప్తంగా కూలీలకు 49లక్షల పని రోజులు కల్పించడమే లక్ష్యంతో 12 రకాల ఉపాధి పనులతో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇప్పటికే 47లక్షల పనిరోజులు పూర్తిచేయగా 96.10 కోట్ల వేజ్ పేమెంట్ పూర్తిచేశారు. సగటున ఒక కూలీకి రూ.197 రోజువారి కూలీ గిట్టుబాటు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు పనులను చేపడుతున్నారు. పల్లెవనాల విభాగం కింద వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచడం వంటి వాటితో పశువుల, గొర్రెల షెడ్లు, ఫాంపాండ్, చేపల చెరువులు, వర్మి కంపోస్టు, నాడెపు కంపోస్టు తయారీ, ఊటకుంటల తవ్వకం, కందకాలు, ఇంకుడు గుంతలు వంటి పనులతో పాటు సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు పలు రకాల పనులతో ఉపాధి హామీ కూలీలకు పని కల్పిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ పని



ఉపాధిహామీ పథకంలో పనికోసం గ్రామపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోగానే వచ్చే వారం నుంచి పని కల్పిస్తున్నారు. కొలతల ఆధారంగా కూలిని ఖాతాలో జమ చేస్తున్నారు. వేసవిలో వ్యవసాయ పనులు తక్కువగా ఉంటాయి. ఉపాధిహామీ పథకాన్ని రైతులు సౌకర్యవంతంగా చేసుకోవడంతో పాటు కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

- శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధి కూలీ, ఇర్కోడు, సిద్దిపేట రూరల్

ప్రజలకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం



గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుతం భూమి అభివృద్ధి పనులు, నీటి సంరక్షణ వంటి పనులు చేపడుతున్నాం. వచ్చే మే, జూన్ నుంచి హార్టికల్చర్‌లో భాగంగా డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, మామిడి, మునగ, కొబ్బరి వంటివి సుమారు 18 రకాల సేవలను అందించడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తున్నాం. కూలీలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నాం. జాబ్ కార్డు ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పని కల్పిస్తున్నాం.

- జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీవో, సిద్దిపేట



అక్కన్నపేటలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా కూలీలు తవ్వుతున్న ఫాంపాండ్



సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలో కూలీలు వేసిన ఫార్మేషన్ రోడ్డు

గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరా కలకలం

- హాస్టల్ ఎదుట విద్యార్థినుల ఆందోళన
- పోలీసుల అదుపులో నిందితుడు



హాస్టల్ వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రవేటు గర్ల్స్ హస్టల్‌లో స్పైకెమెరాను గుర్తించిన విద్యార్థినులు ఆందోళనకు దిగారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట పరిధిలోని మైత్రివిల్లాస్‌లో 2021 నుంచి బండారు మహేశ్వర్ లక్ష్మీ గర్ల్స్‌హాస్టల్‌ను నడుపుతున్నారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థినులు ఉంటున్నారు. శుక్రవారం విద్యార్థినులు స్పై కెమెరాను గుర్తించారు. దీంతో, హాస్టల్ వద్ద ఆందోళన చేసిన విద్యార్థినులు అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ సీఐ నరేష్ కేసు నమోదు చేసి హాస్టల్‌లో గుర్తించిన కెమెరాను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మహేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిమళించిన పాతికేళ్లబంధం

- ఏకం చేసిన వాట్సాప్
- రేపు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో మెగా సమ్మేళనం
- గురువులకు సన్మానం.. భారీ ఏర్పాట్లు

5

కాంగ్రెస్ నేత ఫొటో మార్ఫింగ్

- పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

5

కరువు నేలపై సూక్ష్మసేద్యం

- డ్రిప్, స్పింక్లర్లపై రైతుల ఆసక్తి
- ప్రస్తుతం పండ్ల తోటలకు, కూరగాయల తోటలకూ సబ్సిడీ
- జిల్లాలో సబ్సిడీ టార్గెట్ పూర్తి



హుస్నాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి ప్రాజెక్టులు లేక వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేసే హుస్నాబాద్ ప్రాంత మెట్టరైతులు సూక్ష్మసేద్యంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బిందు (డ్రిప్), తుంపర్ల (స్పింక్లర్లు) సేద్యంతో పంటలను కాపాడుకుంటున్నారు. కరువును అధిగమించడం తో పాటు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పం టలు వేసే అవకాశం ఉండటంతో ఈ సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్క సిద్దిపేట మినహా రాష్ట్రం లో నాలుగేళ్ల నుంచి ఏ జిల్లాలో కూడా డ్రిప్, స్పింక్లర్లకు సబ్సిడీ అందించలేదు. సిద్దిపేట జిల్లా లో కూడా ఒక్క పామాయిల్ తోటలకు మినహా ఇతర పంటలకు సబ్సిడీపై డ్రిప్, స్పింక్లర్లు అందించలేదు. ప్రైవేట్‌గా వీటి ధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు కూడా ఆసక్తి చూపలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీని పునరుద్ధరించింది. పండ్ల తోటలకు, కూరగాయల తోటలు, ఇతర పంటలకు సబ్సిడీపై డ్రిప్, స్పింక్లర్లను అందిస్తున్నారు. జిల్లాలో వీటికి ఇచ్చే సబ్సిడీ టార్గెట్‌ను ఇప్పటికే అధిగమించినట్లు అధికారులు తెలిపారు. డ్రిప్‌లో బావులకు అయితే శాండ్‌ఫిల్టర్, బోర్లకు హైడ్రో సైక్లిన్ ఫిల్టర్ ఉంటుంది. తోటలకు ఆన్‌లైన్ డ్రిప్, వాణిజ్య పంటలకు ఇన్‌లైన్ డ్రిప్‌ను వాడుతారు. డ్రిప్ పరికరాలైన పీవీసీ, గేట్ వాల్స్, ఫిల్టర్‌ను బయట మార్కెట్‌లో కొనుగోలు చేసినట్లయితే రూ. 60 వేల నుంచి రూ. 70 వేల వరకు ఖర్చవుతుంది. అదే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 90 శాతం సబ్సిడీ 5 ఎకరాలు దాటితే 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. ఏడు శాతం జీఎస్టీని మాత్రం రైతులే చెల్లించాల్సి ఉంటుంది. అలాగే స్పిం క్లర్లు ఒక యూనిట్ ధర బయట మార్కెట్‌లో జీఎస్టీతో కలిసి రూ. 26,190 వరకు ఉండగా సబ్సిడీలో రైతు రూ.7,485 చెల్లిస్తే ప్రభుత్వం రూ.17,539 సబ్సిడీ ఇస్తుంది. హెక్టారుకు ఒక యూనిట్ (25 పైపు లు, 5 నాజిల్స్, 5 రైజర్ పైపులు) ఇస్తారు. ఎకరం పైన ఉన్న ప్రతి రైతుకు ఈ సబ్సిడీ వర్తిస్తుంది.

టార్గెట్ పూర్తి

జిల్లాలో టార్గెట్ ప్రకారం ఇన్‌లైన్ డ్రిప్ 690 మంది రైతులకు 950 హెక్టార్లకు సబ్సిడీ ద్వారా అందించారు. ఆన్‌లైన్ డ్రిప్ 200 హెక్టార్లకు ఇచ్చారు. వీటికి రైతుల నుంచి మరో 450 దరఖాస్తులు వచ్చాయని, వీటి కోసం అధికారులు ప్రపోజల్ పంపారు. అలాగే స్పింక్లర్లు 1013 మంది రైతులకు అందించారు. వీటి కోసం మరో 700 దరఖాస్తులు రాగా మార్చిలోగా వాటిని అం దించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 6 వేల ఎకరాల్లో డ్రిప్, స్పింక్లర్ల ద్వారా సాగు చేస్తున్నారు. ఈ డివిజన్‌లో డ్రిప్ కోసం 438 మంది రైతులు 800 ఎకరాలకు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోగా 42 మందికి 122 ఎకరాలకు అందించారు. స్పింక్లర్లకు 250 మంది దరఖాస్తు చేసుకోగా 233 మందికి సబ్సిడీపై స్పింక్లర్లు ఇచ్చారు.

స్పింక్లర్లతో పంటను కాపాడుకుంటున్నా..



నాకు 3 ఎకరాల భూమి ఉంది. బావి ఉన్నా కూడా తక్కువ నీళ్లు వెళ్తున్నాయి. సబ్సిడీ మీద స్పింక్లర్లు తీసుకుని రెండు ఎకరాల్లో వేరుశనగ పంట వేశా. అది పూర్తయింది. ఇప్పుడు మూడెకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నా.. స్పింక్లర్లతోనే నీటిని పారిస్తున్నా.

- మోటం నర్సయ్య, రైతు పొట్లపల్లి

చాలామంది కొనుగోలు చేస్తున్నారు



ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటడంతో చాలామంది రైతులు డ్రిప్, స్పింక్లర్లపై ఆధారపడి పంటలను కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా సబ్సిడీపై వీటిని అందిస్తున్నది. వీటి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయవచ్చు.


- వెంకట్రాంరెడ్డి, మైక్రో ఇరిగేషన్ డీలర్

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు



జాతీయ రహదారిపై బల్లట్‌లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నర్సాపూర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ పరిధిలో అనేక మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండడంతో పాటు మరెందరో క్షతగాత్రులు అవుతున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నర్సాపూర్ పోలీసులు జాతీయ రహదారిపై ప్రమాదకర మలుపులు, అటవీ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు కొండాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు మధ్యలో వాహనాల వేగాన్ని నియంత్రించేలా బల్లట్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లింగం మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ తాము మలుపులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నచోట బల్లట్‌లను ఏర్పాటు చేశామన్నారు.





వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగు మృతిచెందారు. ఈ సంఘటన మెదక్, హవేళిఘణపూర్, గజ్వేల్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నాయి.



కిరణ్(ఫైల్), సయ్యద్ మునవర్(ఫైల్), భువనగిరి బాలమణి(ఫైల్)

మెదక్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందగా.. మరో వ్యక్తి గాయాలైన సంఘటన సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన ఆకుల నర్సింలు మధ్యాహ్నం 1 గంటలకు గాంధీనగర్ నుంచి బైక్‌పై పట్టణంలోకి వస్తూ.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. న్యూబస్టాండ్ వైపు వేగంగా గాంధీనగర్ వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. నర్సింలు ముఖానికి, కాళ్లకు, చేతులకు గాయాలు కాగా.. పిట్లంబేఎకు చెందిన కిరణ్(26) తీవ్ర గాయాలయ్యాయి. కిరణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు.

కమాన్ పైకప్పు కూలడంతో..

హవేళిఘణపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక కమాన్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. మెదక్ మండలం మంబోజిపల్లినికి చెందిన సయ్యద్ మునవర్(21) క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి హవేళిఘణపూర్ గ్రామ శివారులోని పోచమ్మగుడి సమీపం నుంచి మట్టిని టిప్పర్‌లో తీసుకెళ్తూ.. శ్మశానవాటిక కమాన్‌ను ఢీకొట్టాడు. కమాన్ పైకప్పు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. తల్లి ముంతాజ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ...

గజ్వేల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. మండల పరిధిలోని రంగంపేట గ్రామానికి చెందిన భువనగిరి బాలమణి(35)కి ఇద్దరు పిల్లలు. బాలమణి భర్త భువనగిరి నర్సింలు గురువారం రాత్రి మొక్కజొన్నకు పందులు వస్తున్నాయని చుట్టూ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేసి ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం బాలమణి మోటార్ స్టార్ట్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ కూతురు మృతికి కారణమైన అల్లుడు నర్సింహులుపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి బాలనర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన నర్సాపూర్-వెల్దురి ప్రధాన రోడ్డుపై శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం.. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని జరుకుల రామోజీ(50) శుక్రవారం తెల్లవారు జామున పొలంలో పనులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై తీవ్రగాయాలతో పడిపోయాడు. రోడ్డుపై నిల్చున్న మరో వ్యక్తి గమనించి రామోజీని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

హత్నూర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన చాకలి శివకుమార్(25) సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం సాయంత్రం బస్సును స్కూల్‌లో పెట్టి బైక్‌పై హత్నూరకు వస్తున్నాడు. మల్కాపూర్ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో 108 అంబులెన్సులో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి చాకలి యాదమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భార్య మృతిచెందడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ్వంపేట మండలం పాంబండకు చెందిన గుమ్మల శేఖర్ భార్య 10 ఏళ్ల క్రితం మృతిచెందడంతో.. నాయనమ్మ పోచమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కాగా పోచమ్మ ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న శేఖర్ శుక్రవారం ఉదయం 11.45 గంటలకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ఏసప్ప

కోహీర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన కోహీర్ మండలం బడంపేట గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సజ్జాపురం ఏసప్ప ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పూలమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల కష్టాలు పాలకులకు పట్టవా..?

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్/మనోహరాబాద్/వట్‌పల్లి/నారాయణఖేడ్/శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల కష్టాలు పాలకులకు పట్టవా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర సరుకులు ధరల్లో విపరీతంగా పెరిగిపోయాయని, పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, నాయకులు రాజయ్య, బాగారెడ్డి, యాదగిరి, కొండల్‌రెడ్డి, ప్రసన్నరావు తదితరులు పాల్గొన్నారు. మూడునెలల జీతాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అలాగే వట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ డివిజన్ కార్యదరిశ నల్లవల్లి రమేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. శివ్వంపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు.


విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చేగుంట/వెల్దుర్తి/కల్హేర్/చిలప్‌చెడ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశామని మక్కరాజుపేట గ్రామ ప్రత్యేక అధికారి అమర్ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలు, మక్కరాజుపేటలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రభుత్వ బాలుర హాస్టల్, కస్తూర్బా పాఠశాలలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, డీటీడీవో నీలిమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్, కస్తూర్బా పాఠశాలల్లో తరగతి గదులతో పాటు వంటశాల, వంట సామగ్రి, స్నానపు గదులు, మూత్రశాలలు, ఆవరణలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, కస్తూర్బా ఎస్‌వో ఫాతిమా, బాలుర హాస్టల్ వార్డెన్ నవీన్ ఉన్నారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని కల్హేర్ ఎంపీడీవో రమేష్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ కస్తూర్బా పాఠశాల, చండూరు ప్రాథమిక పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, వంట గదిని, స్టోర్‌రూం లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఆనంద్, ఏపీవో శ్యాంకుమార్, సిబ్బంది ఉన్నారు.









పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవాలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



పోలేరమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు, భక్తులు

వట్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండలంలోని షాదనగర్‌లోని పోలేరమ్మ ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హోమం నిర్వహించారు. అమ్మవారికి మహంకాళి మహాలక్ష్మి, మహా సరస్వతి, పార్వతి పరమేశ్వరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి ఉపాసకులు దత్తాత్రేయస్వామి, అరవింద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

హత్నూర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీతా రామచంద్రస్వామి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మాధవానంద సరస్వతి స్వామీజీ చేతులమీదుగా ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

టేక్మాల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాదులూర్ గ్రామంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గంగి రాజేందర్ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆసుపత్రిపై దాడి కేసులో ఆరుగురికి రిమాండ్

సంగారెడ్డి క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని వెల్‌నెస్ ఆసుపత్రిపై దాడిచేసిన ఘటనలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. కోహీర్ మండలం మద్రికి చెందిన మహానందిని గతనెల 28 వెల్‌నెస్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా.. మార్చి 1న మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆసుపత్రిపై దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

ఫస్టియర్ పరీక్షకు 523 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 18,594 మందికి 18,071 మంది హాజరుకాగా, 523 మంది గైర్హాజరయ్యారు. 97.19 హాజరుశాతం నమోదైంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, షాహీన్, శ్రీతేజ జూనియర్ కళాశాల కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ సందర్శించారు.

ఆమె.. అన్నింటా..

నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవం

మహిళా శక్తి అమోఘం. ఒకరు తనలోని వైకల్యాన్ని జయించి.. తనలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారు. మరొకరు అంతరించిపోతున్న చేతి వృత్తిని వ్యాపారాత్మకంగా మార్చి అంత్రెపెన్యూర్‌గా ప్రశంసలు అందుకుంటున్నారు. ఓ డాక్టర్ విశ్రాంతి ఉద్యోగానికే కాని.. సేవకు కాదని నిరూపిస్తున్నారు. ఇలా ఎందరో మహిళామణులు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికీ వందనం..



తనలాంటి వారికి అండగా..

అంగవైకల్యం ఉన్నా.. నలుగురికి ఉపాధి మార్గం

కంది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం.. కుటుంబాన్ని చూస్తే పూట గడవడం కూడా కష్టమే. ఇలాంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని.. నలుగురికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదిగారు జుబేదా.. తనలాంటి దివ్యాంగులు ఆత్మగౌరవంగా బతకడానికి ఓ మార్గం చూపించారామె. సంగారెడ్డి మండలం కల్పగూరుకు చెందిన జుబేదా తల్లిదండ్రులు ఖాజామియా, బిస్మిల్లాబీ నిరుపేదలు. నలుగురు అక్కాచెల్లెళ్లు, ఓ తమ్ముడు. పుట్టుకతోనే కాలికి పోలియో సోకినా దిగులు చెందలేదు. ఓపెన్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె తనలాంటి దివ్యాంగులకు ఏదైనా చేయాలనే సంకల్పంతో వికలాంగుల చైతన్య కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని దివ్యాంగులను ఏకం చేసి, 2001లో దివ్యాంగులకు ఇంటి స్థలాలు కావాలని 2001లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడును కలిసి, వినతిపత్రం ఇచ్చారు. అధికారుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు 2003లో కందిలో దాదాపు 300 మంది దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు ఇప్పించారు. అక్కడ లక్ష్మీనగర్ కాలనీ ఏర్పాటుకు కృషి చేశారు. సంగారెడ్డిలో దివ్యాంగ్ సోలార్ సొసైటీని స్థాపించారు. అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ సంగారెడ్డి వెలుగు కార్యాలయంలో భవనం, కొంత మూలధనం ఏర్పాటు చేయగా, దివ్యాంగులకు సోలార్‌లైట్ల తయారీలో శిక్షణ ఇప్పించారు. ఒంటరి మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. ఇక్కడి నుంచి జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టి పంపిస్తున్నారు. ఆమె చేస్తున్న కృషిని అప్పటి గవర్నర్ తమిళిసై, మంత్రి దామోదర్ రాజనర్సింహా, కలెక్టర్‌లు ప్రశంసించడంతో పాటు అవార్డులూ అందజేశారు.



అన్నీ తానై..

జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు, ఒంటరి మహిళలు తమకు కష్టం వచ్చిందని జుబేదా ఇంటి తలుపు తడితే చాలు వారికి అన్నీ తానుగా మారుతున్నారు. దివ్యాంగులకు పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు, ట్రై సైకిళ్లు, చేతికర్రలు, ఇంటి స్థలాలు, ఇల్లు కట్టుకోవడానికి రుణాలు ఇప్పిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళల సమస్యలు వినేందుకు రూ. ఏడున్నర లక్షలతో దివ్యాంగుల కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. ఇక్కడే హెల్త్‌క్యాంపులు, సమావేశాలు నిర్వహిస్తారు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా మనసు పెట్టి పని చేస్తే ఎంతటి కష్టాన్ని అయినా అధిగమించవచ్చునంటారు జుబేదా.

అవిశ్రాంత డాక్టర్..!

ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా సేవలు

రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా రిటైర్



నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా రెండేళ్లు విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యారు. అంతటితో ఆగిపోకుండా తన మెట్టినిల్లయిన నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా ఉచితంగా సేవలు అందిస్తున్నారు డాక్టర్ వీణాకుమారి. తాను ఆస్పత్రిలో అందుబాటులో లేకపోయినా.. ఫోన్ చేస్తే చాలు సలహాలు ఇస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారామె. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రముఖ కమ్యునిస్టు నేత కేవల్‌కిషన్ కుమార్తె అయిన డాక్టర్ వీణాకుమారి నర్సాపూర్‌కు చెందిన గోవర్ధన్‌ను వివాహం చేసుకున్నారు. ప్రభుత్వ డాక్టర్‌గా అంచెలంచెలుగా ఎదిగి 2016 నుంచి 2018 వరకు రాష్ట్ర కమిషనర్‌గా పని చేశారు. రిటైర్మెంట్ తర్వాత నర్సాపూర్‌లోనే ఉంటూ ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్ వీణాకుమారి గైనకాలజీ స్పెషలిస్ట్ కావడంతో నర్సాపూర్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ప్రసవ, మహిళలకు వైద్య సేవలు అందజేస్తున్నారు. దీంతో నర్సాపూర్‌తో పాటు నియోజకవర్గం నుంచి చాలా మంది గర్భిణులు ఆస్పత్రికి వస్తుంటారు. డాక్టర్ వీణాకుమారి చివరి వరకు సాధారణ ప్రసవాల కోసమే ప్రయత్నిస్తుంటారు. ఆమె అందిస్తున్న సేవలతో జిల్లాలోనే ఎక్కువ డెలివరీలు చేస్తున్న ఆస్పత్రిగా ప్రత్యేకతను చాటుకుంటోంది.

కూలి పనులకు వెళ్లలేక.. కళల వైపు

నకాశీ కళలో రాణిస్తున్న మంగ



నకాశీ ఫేస్‌మాస్క్‌లు తయారు చేస్తున్న పసుల మంగ

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తులకు కాలం చెల్లుతున్న రోజుల్లో పట్టుదల, ఏకగ్రతతో నకాశీ చిత్ర కళారంగంలోకి వచ్చి.. స్వయంకృషిలో అంత్రెపెన్యూర్‌గా మారింది. భర్త అడుగుల జాడల్లో నడుస్తూ తనలోని ప్రతిభతో ఒక్కో మెట్టే ఎక్కుతూ.. రైతు కూలీగా మారాల్సిన ఆమె రాష్ట్ర పెద్దలంతా ఆశీనులైన వేదికను పంచుకునే స్థాయికి ఎదిగింది చేర్యాల పట్టణానికి చెందిన పసుల మంగ. వేములవాడకు చెందిన ధనాలకోట వెంకటరామయ్య చేర్యాలలో స్థిరపడి నకాశీ చిత్రకళలకు పురుడుపోశారు. అతని కుటుంబ సభ్యుల వద్ద పసుల మల్లేశం, నాగిళ్ల గణేశ్‌లు శిక్షణ పొందారు. తర్వాతి రోజుల్లో వెంకటరామయ్య కుటుంబీకులంతా హైదరాబాద్‌కు వలస వెళ్లారు. దీంతో చేర్యాల నకాశీ వారసత్వ కళ అంతరించిపోతుందనుకున్న సమయంలో పసుల మల్లేశం, నాగిళ్ల గణేశ్ నకాశీ కళను బతికించే ప్రయత్నం చేశారు. అప్పటికీ వారి ఆర్థిక పరిస్థితి అంతంతే.. ఈ క్రమంలో పసుల మల్లేశం సతీమణి మంగ నకాశీ కళ నేర్చుకున్నారు. తనకున్న ప్రతిభతో కొద్దిరోజుల్లోనే మంచి పేరు తెచ్చుకున్నారు. మరో పక్క ప్రభుత్వ ప్రోత్సాహంతో అంత్రెపెన్యూర్‌గా వీ హబ్‌లో అడుగుపెట్టారు. సంప్రదాయ కళకు వ్యాపార హంగులు అద్దారు. కళాత్మక ప్రయోగాలు ఎన్నో చేశారు దీంతో ఆర్డర్లు పెరిగాయి. పని ఒత్తిడి పెరగడంతో మరో పది మందికి శిక్షణ ఇచ్చి.. వారిని తనవద్దే నియమించుకున్నారు. దేశ విదేశాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి చేర్యాల ప్రాంతానికి పేరు తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే హస్తకళ ప్రదర్శనలో ఆమె ప్రతిభను చూసి గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, గత ప్రభుత్వ హాయంలో మాజీ మంత్రి కేటీఆర్ తదితరులు అభినందించారు. అందరి మన్ననలతోపాటు మరెన్నో అవార్డులు అందుకున్నారు మంగ.

బొమ్మలు చేస్తూ.. ప్రాణం పోస్తూ..

అభినవ శిల్పి

చెక్కబొమ్మల శకుంతల

జహీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చెక్క ఆమె చేతిలో పడితే అపురూపమైన బొమ్మగా మారిపోతుంది. అందుకే శకుంతల కాస్త చెక్కబొమ్మల అనేది ఇంటిపేరుగా మారి చెక్కబొమ్మల శకుంతలగా మారిపోయింది. అంతగా చదువు లేకపోయినా.. తనకున్న ఆసక్తి మేరకు చెక్కబొమ్మల తయారీలో రాణిస్తూ దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు.



చెక్కలతో బొమ్మలను తయారు చేస్తున్న శకుంతల

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని సుభాష్‌గంజ్‌కు చెందిన చెక్కబొమ్మల శకుంతల 25 ఏళ్లుగా చెక్కబొమ్మలు తయారు చేస్తున్నారు. వాస్తవానికి ఆమె తల్లిదండ్రులది బీదర్ కాగా, వారు చెక్కబొమ్మలు తయారు చేస్తూ జీవనం సాగించేవారు. నిత్యం వారు బొమ్మలు తయారు చేయడం చూసిన శకుంతలకూ ఈ రంగంలో రాణించాలని ఆసక్తి పెరిగింది. తండ్రికి చెప్పడంతో ఆయన చెక్కబొమ్మల తయారీలో శిక్షణ ఇప్పించారు. తర్వాత జహీరాబాద్‌కు చెందిన నాగిశెట్టితో వివాహం జరగగా, భర్త సహకారంతో చెక్కబొమ్మలను తయారు చేస్తూ గుర్తింపు సాధించారు. దేవతామూర్తుల బొమ్మలతో పాటు కీచైన్లు, అగర్‌బత్తీ స్టాండ్లు, పూలకుండీలు తదితరాలు తయారు చేస్తూ దేశవిదేశాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో తన బొమ్మలను విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 3వేల ప్రదర్శనల్లో పాల్గొని అందరి మన్ననలు పొందారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఈ రంగంలో మరింత రాణిస్తానని, మహిళా కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు చెక్కబొమ్మల శకుంతల.



శకుంతల తయారుచేసిన బొమ్మలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఫైల్)

కష్టాలెదురైనా..

రైట్.. రైట్..

మెదక్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు టికెట్.. టికెట్ అంటూ అరుపులు.. జనం మధ్యలో బస్సులో అటు నుంచి ఇటు తిరగడం మగవాళ్లకు పెద్ద కష్టం కాకపోయినా.. మహిళలకు పెద్ద కష్టమే. ఆటుపోట్లు ఎదురైనా రైట్.. రైట్ అంటూ మహిళా కండక్టర్లు తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిసున్నారు. బస్సులో ప్రయాణం ఎంత సురక్షితమో.. మహిళా ఉద్యోగుల (కండక్టర్ల) విధుల నిర్వహణ అంతే కష్టం. పనుల్లో ఎంత ఒత్తిడి ఉన్నా మనోధైర్యం తెచ్చుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణ ఆర్టీసీ డిపో పరిధిలో 43 మంది మహిళా కండక్టర్లు విధుల్లో కొనసాగుతున్నారు. రోజూ 16 గంటల వరకూ విధులు నిర్వహిస్తూ కుటుంబానికి పెద్దదిక్కు పాత్ర పోషించడం శభాష్ అనిపించుకుంటున్నారు.



మెదక్‌లో మహిళాకండక్టర్లు లంచ్ చేస్తున్న దృశ్యం

ఉద్యోగం తృప్తినిస్తోంది



సవాళ్లను ఎదుర్కొంటూనే.. కుటుంబానికి బసటగా నిలువడం తృప్తినిస్తోంది. విధులు నిర్వహించడానికి ముందే సిద్ధం కావాల్సి ఉంటుంది. తెల్లవారుఝాము 4 గంటలకే వంట చేసి, అత్తా మామలకు, పిల్లలకు టిఫిన్లు సర్ది. బస్సు రావడానికి ఒక గంట ముందే బస్టాండుకు చేరుకుంటా. నిత్యం 14 గంటల పాటు టిక్కెట్లు ఇస్తూ ప్రయాణికులను గమ్యస్థానానికి చేరుస్తున్నా. ఉద్యోగ జీవితంలో భర్త సహకారం ఉంది.

-స్వప్న, కండక్టర్, మెదక్

డ్యూటీలు చేసి అలసిపోతున్నా....

ఆటు పోట్లను ఎదుర్కొని కండక్టర్లుగా పని చేస్తున్నాం. డిపో మేనేజర్, ఇతర ఉద్యోగులు, భర్త సహకారంతో ఉద్యోగంలో ఇబ్బందులు లేవు. ఉదయం నుంచి రాత్రి వరకు డ్యూటీ చేయడంతో కొంత అలసిపోతున్నా. మహిళా దినోత్సవం సందర్భంగా మా డీఎం మహిళా కండక్టర్లకు సెలవు ప్రకటించడం ఆనందంగా ఉంది.



విజయలక్ష్మి, కండక్టర్, మెదక్





సమావేశంలో మాట్లాడుతున్న అంజలీయాదవ్

నామినేటెడ్ పదవుల్లో మహిళలకూ స్థానం

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలీయాదవ్

మెదక్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలీయాదవ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పారిశుధ్య కార్మికులు, స్టాఫ్‌నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ. 500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, డ్వాక్రా రుణాలు తదితర సౌకర్యాలు కల్పించిందన్నారు. మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. మహిళలతో జిల్లా కమిటీలు వేస్తామని తెలిపారు. మార్చి 8న రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ, మాజీ ఎంపీపీ అరుణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి సులోచన, గోదల జ్యోతి, జిల్లా నాయకులు హరితా నర్సింగ్‌రావు, స్వరూప ఉన్నారు.





భువనగిరి ఎంపీతో పూజల హరికృష్ణ, మార్ఫింగ్ చేసిన తర్వాత

కాంగ్రెస్ నేత ఫోటో మార్ఫింగ్

పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

సిద్దిపేట క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఫొటోను కొందరు మార్ఫింగ్ చేశారని, ఎంపీ ఫొటో స్థానంలో మాజీమంత్రి హరీశ్‌రావు ముఖాన్ని మార్ఫింగ్ చేసి, హరికృష్ణ బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారంటూ గురువారం సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోటో మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా, యూత్, కిసాన్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సిద్దిపేట వన్‌టౌన్, టుటౌన్, త్రీ టౌన్, చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పూజాల హరికృష్ణ రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక, ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖలీముద్దీన్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పదకొండు వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగు

రాయపోల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11 వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు సాగు అవుతోందని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాకర్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని మంతూరులో శుక్రవారం ఆమె పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచలు చేశారు.

కస్తూర్బాలో బాలికను చితకబాదిన టీచర్

కంగ్టి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పూల మొక్కలకు నీరు ఎందుకు పోయడం లేదని బెదిరిస్తూ 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఉపాధ్యాయురాలు చితకబాదడంతో చేతికి వాపు వచ్చి అస్వస్థతకు గురైంది. సంగారెడ్డి కంగ్టి మండల కేంద్రంలోని కేజీబీవీలో రెండ్రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కస్తూర్బాలో కాలేజీకి కంగ్టికి చెందిన రాశి అనే విద్యార్థిని 9వ తరగతి చదువుతున్నది. బుధవారం రాత్రి విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలు సురేఖ విద్యార్థినులతో మొక్కలకు నీరు పోయడం, డ్రమ్ముల్లో నీరు నింపడం చేయించారు. కడుపునొప్పితో బాధపడుతున్న రాశి నీరు పోయలేనని చెప్పి నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు సురేఖ బాలికను తీవ్రంగా కొట్టింది. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న బాలిక తల్లిదండ్రులు శుక్రవారం కంగ్టికి వచ్చిన సందర్భంగా కూతురిని కలిసేందుకు పాఠశాలకు వెళ్లగా విషయం తెలుసుకొని బోరున విలపించారు. చదువుకునేందుకు పిల్లలను కేజీబీవీలో చేర్పిస్తే వారితో పనులు చేయించి శిక్షించడమేమిటని నిలదీశారు. రాశిని కొట్టిన సదరు ఉపాధ్యాయులకు శుక్రవారం విధులకు హాజరు కాకపోవడంతో ప్రత్యేకాధికారి విజయలక్ష్మితో వాగ్వాదానికి దిగారు. తమ కూతురితో పాటు మరో నలుగురు అమాయిలను సైతం ఉపాధ్యాయురాలు దండించిందని రాశి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



బాధిత బాలిక, తల్లి

పునరావృతం కాకుండా చూస్తాం : ఎంఈవో రహీమొద్దీన్

ఈ విషయంపై ఎంఈవో రహీమొద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఉపాధ్యాయురాలు విద్యార్థినిని దండించిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై ఎస్‌వోతో మాట్లాడగా పొరపాటున జరిగిందని తెలిపారన్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

పరిమళించనున్న పాతికేళ్ల బంధం

ఏకం చేసిన వాట్సాప్- రేపు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో మెగా సమ్మేళనం

గురువులకు సన్మానం - భారీ ఏర్పాట్లు

గజ్వేల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల బంధం పరిమళించనుంది. 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థిలోకం అంతా ఒక్కచోట చేరనుంది. ఇందుకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జీఎంఆర్‌పాలిటెక్నిక్ గురుకుల కళాశాల వేదిక కానుంది. 1988లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో అప్పట్లో ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. రాష్ట్రంలోనే టాప్ విద్యాసంస్థగా పేరు గడించింది. ఈ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్ కోర్సులున్నాయి. తొలిరోజుల్లో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సు కూడా ఉండేది. అప్పట్లో ఇది ఓ మారుమూల ప్రాంతం. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత గొప్పగా కనీవినీ రీతిలో అభివృద్ధికి నోచుకుంది. స్వయాన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కూడా ఈ గజ్వేలే కావడంతో కళాశాల ఆవరణలో బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటైంది.



గజ్వేల్‌లోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కలిపిన వాట్సాప్

టెక్నికల్ విద్యను అభ్యసించిన విద్యార్థులను టెక్నాలజీ మరోసారి ఒకటి చేసింది. ఇక్కడ చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడికో చేరిన వారిలో కొంత మంది అప్పుడప్పుడు కలిసేవారు. అయితే, వాట్సాప్ వచ్చిన తర్వాత ఒక్కొక్కరుగా గ్రూపులో చేరి ఒకే వేదికపైకి వచ్చారు. తోటి స్నేహితుల కుటుంబాలు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ధైర్యాన్ని చెబుతూ మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తున్నారు.

పట్టణంలో గురువులతో భారీ ర్యాలీ

1988 నుంచి చదువుకున్న విద్యార్థులలో 25ఏళ్లు నిండిన పూర్వ విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి చదువులు చెప్పిన అధ్యాపకులను ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి ఆహ్వానం పలికారు. వారు కూడా తమ పిల్లల్లాంటి విద్యార్థులను మనసారా కలుసుకుని మరోసారి దీవించేందుకు రానున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. గజ్వేల్ మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీ వరకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తారు.



వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు

చందాపూర్‌లో వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్

ప్రారంభించిన జిల్లా రవాణాశాఖ అధికారి

వర్గల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందాపూర్ వద్ద రాష్ట్రంలోనే రెండో పెద్ద వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్ ప్రారంభమైంది. దీనిని జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు శుక్రవారం ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఆమోదంతో ఏర్పాటు చేస్తున్న ఈ స్క్రాపింగ్ ప్లాంట్‌కు రిజిస్ట్రేషన్ లేని, ఫిట్‌నెస్ కానీ వాహనాలు, వివిధ సందర్భాల్లో దెబ్బతిన్న, 15 ఏళ్ల గడువు ముగిసిన వాహనాలను స్క్రాపింగ్ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వాతావరణ సమతుల్యత కాపాడేందుకు కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ చేసే చట్టాన్ని కఠినతరం చేశాయని వివరించారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం అందించేందుకు కాలం చెల్లిన వాహనాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన, కండిషన్ లేని వాహనాలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అలాంటి వాహనాలను స్క్రాప్ చేయాలన్నారు. గడువు మీరిన వాహనాలను స్క్రాప్ చేస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్, అడిషనల్ ఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏసీపీ వెంకటరెడ్డి, అంబ ర్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్లు గిరీష్‌కుమార్, హరి గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భెల్ ఫ్లై ఓవర్ ప్రారంభం

పరిశీలించిన ఎంపీ రఘునందన్

రామచంద్రాపురం టౌన్ మార్చి 7(ఆంధ్రజ్యోతి): భెల్ కూడలిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభం కానుందని ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు నితన్ గడ్కరీ, హెడీ కుమార్‌స్వాములు హాజరవుతారని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భెల్ కూడలిలో రెండు వైపులా వంద అడుగుల వెడల్పులో రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లింగంపల్లి కూడలిలో ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించాలని, వంతెన కింది భాగంలో మొక్కలతో అలంకరణ చేయడంతో పాటు అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లో పార్క్ నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఎంపీ అధికారులకు సూచించారు. అనంతరం బీహెచ్ఈఎల్ జీఎంతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, జాతీయ రహదారుల అభివృద్ధి మండలి డీఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

సిద్దిపేట క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని పట్టుకొన్నారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి ముగ్గురికి రూ.4500 జరిమాన, వారిలో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.

గజ్వేల్‌లో 11 మందికి జరిమానా

గజ్వేల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గజ్వేల్‌లోని ఆయా చౌరస్తాలలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా 11మంది పట్టుబడ్డారని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక 11మందికి రూ.7000 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారని పేర్కొన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

మద్దూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ వేసవిలో వడదెబ్బ సోకకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సువర్ధసన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రేబర్తి పాఠశాలలో హెచ్ఎం చంద్రభాను అధ్యక్షతన వడదెబ్బ నివారణ చర్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

సిద్దిపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ శ్రీకాంత్ వారి తండ్రి బండి నర్సయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి గోదావరి, ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్‌లో

మిరుదొడ్డి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామ వాస్తవ్యులు అక్కపల్లి రాందాస్‌గౌడ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్స్, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఎమ్మార్సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలానికి ఇటీవల మండల విద్యావనరుల కేంద్రం మంజూరైంది. భవన నిర్మాణానికి అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఎంఈవో రమేశ్, ఆర్ఐ శ్రీనివాస్ రైతువేదిక సమీపంలో ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ సర్పంచు బండమీది సంతోషి శుక్రవారం ప్రారంభించారు. అలాగే, ముస్త్యాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచు పెడుతల ఎల్లారెడ్డి

దశాబ్దాల సేవలకు సెలవు

● పాత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ భవనం కూల్చివేత

హుస్నాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా కార్యాలయాలు వచ్చినప్పుడు ఈ భవనమే అక్కున చేర్చుకుని నిర్వహణ బాధ్యతలకు నిలయమైంది. దీనికి నూతన భవనం నిర్మాణం కావడంతో కాలగర్భంలో కలిసిపోతుంది. ఇలా నాలుగున్నర దశాబ్దాలు సేవలందించిన ఈ భవనాన్ని శుక్రవారం నుంచి కూల్చుతుండటంతో పలువురు దాని సేవలను గుర్తు తెచ్చుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ ప్రధాన రహదారి మండల పరిషత్ కార్యాలయం పక్కన జూలై, 1980 సంవత్సరంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. 1999 మున్సిఫ్ కోర్టు మంజూరుకావడంతో ఈ భవనంలోనే కొనసాగించారు. అనంతరం మళ్లీ పంచాయతీరాజ్ డివిజన్ ఇంజనీరింగ్ కార్యాలయం కొనసాగింది. 2016లో జిల్లాల పునర్విభజన అనంతరం ఏసీపీ కార్యాలయం మంజూరు కాగా ఈ భవనంలోనే ఏర్పాటు చేశారు. తొమ్మిది సంవత్సరాల అనంతరం ఏసీపీ నూతన కార్యాలయాన్ని ఈ భవనం వెనుక స్థలంలో నిర్మింపజేశారు. ప్రస్తుతం ఆ భవనానికి అడ్డుగా ఉండటంతో దీనిని కూల్చి వేస్తున్నారు. దీంతో నాలుగున్నర దశాబ్దాల పాటు సేవలందించిన ఈ భవనం ఇక సెలవు అంటున్నట్లుగా ఉంది.


ఏసీపీ నూతన కార్యాలయం నిర్మాణం పూర్తికావడంతో ముందువైపు ఉన్న భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయిస్తున్న దృశ్యం

నీటిని విడుదల చేయాలి

గజ్వేల్ ఆర్డీవోకు తిప్పారం, ముద్దాపూర్ రైతుల వినతి

నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించిన నాయకులు

కుకునూరుపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రాజన్న చెరువులోకి నీటిని విడుదల చేయాలని మండలంలోని తిప్పారం, ముద్దాపూర్ రైతులు శుక్రవారం గజ్వేల్ ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మసాగర్‌కి నీటిని తరలించేందుకు నిర్మించిన కాలువ నుంచి తిప్పారం రాజన్న చెరువుకు యాటీ కాలువ ఉన్నదని, ఇప్పటివరకు ఆ కాలువ ద్వారా నీటిని చెరువులోకి వదలలేదని తెలిపారు. రాజన్న చెరువుని మల్లన్నసాగర్ జలాలతో నింపితే 100 ఎకరాలను సాగుచేస్తున్న 50 మంది రైతులకి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహేందర్, అంజయ్య, సురేష్‌గౌడ్, సాయి కుమార్, చరణ్, స్వామి పోచయ్య, చంద్రమౌళి, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.


కుకునూరుపల్లి : గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పంటల పొలాలకు నీళ్లు వదలాలి

జగదేవ్‌పూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మసాగర్ జలాశయం నుంచి పంట కాలువ ద్వారా వచ్చే నీటిని మునిగడప, రాంనగర్ వరకు వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ నేత, తిగుల్ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్‌రావు అధికారులను కోరారు. గజ్వేల్‌లో నీటి పారుదల శాఖ అధికారులు చాందీరామ్, శ్రీధర్‌ను మండల కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాంనగర్ వరకు పంట కాల్వ పనులను మధ్యలో నిలిపి వేశారని, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మునిగడప మీదుగా రాంనగర్‌కు కొండ పోచమ్మసాగర్ నీళ్లను వదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాట్లపల్లి మాజీ ఎంపీటీసీ సావిత్రి, మాందాపూర్ మాజీ సర్పంచ్ భిక్షపతి, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ నరేష్, రత్న, నర్సింలు, స్వామి, కిష్టయ్య ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు

సిద్దిపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భూమయ్యగారి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి, అంకంపేటలో ఎండిపోయిన పంటలను బీఆర్ఎస్ ప్రతినిధులు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ బృందం

పేదలకు గూడు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పేదలకు గూడు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఇందిరమ్మ రాజ్యస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం రాంపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకు ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు అందించలేదని, పైగా కమీషన్లు దండుకుని ప్రజలను వంచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణానికి చెందిన పచ్చిమడ్ల పెంటయ్యను పరామర్శించారు.


నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కొమ్మూరి

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్

నంగునూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వ ర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ గ్రీన్‌ఛానల్ ద్వారా నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోవాలన్నారు.


నంగునూరు : ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సంఘం జిల్లా కార్యదర్శి మహేశ్

ఎంపీడీవో, ఎంపీవోకు వినతి

సిద్దిపేట రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని నారాయణరావుపేట మండల పరిషత్తు కార్యాలయంలో కార్మికులు ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్‌రావుకు పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా నాయకులు దోటి శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

నేరుగా వేతనాలు చెల్లించాలి

తొగుట, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులలా గ్రీన్‌ఛానెల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తొగుట మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి


ధర్మాజీపేట జడ్పీహెచ్ఎస్‌లో తనిఖీ చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చునని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని భవిత కేంద్రంతో పాటు ధర్మాజీపేట, రాజక్కపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయులు రమ తదితరులున్నారు. దుబ్బాకలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం డీఐఈవో రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో ఏడాదిన్నరగా అపరిష్కృతంగా ఉన్న మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసిత, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఐవోసీ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు. గత ఎన్నికల ముందు మల్లన్నసాగర్ భూనిర్వాసితుల గూర్చి మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖం చాటేశారన్నారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించపోతే రంజాన్, ఉగాది పండుగ తర్వాత పోరాటం తప్పద న్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మాజీ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

పొట్లపల్లి ఆలయంలో అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆమె పొట్లపల్లి ఆలయాన్ని సందర్శించి ఆలయ ప్రత్యేకత, ఆలయంలోని సౌకర్యాల గూర్చి ఈవో కిషన్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుస్నాబాద్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి భోజన వసతి సౌకర్యాలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎల్లమ్మ రోడ్‌లో వై జంక్షన్ నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో కొలతలు సేకరించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, టూరిజం శాఖ అధికారులు, ఎంఈవో మనీల తదితరులు ఉన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు దగ్ధం


అగ్నికి ఆహుతి అవుతున్న ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు

మద్దూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండల కేంద్రం నుంచి లద్నూరుకు వెళ్లే దారిలోని కాలువ సమీపంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఎవరో ఆకతాయిలు రోడ్డు సైడ్‌లో పెరిగిన చెత్తాచెదారానికి నిప్పుపెట్టారు. దీంతో కాల్చుకుంటూ వస్తూ ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. రోడ్డుగుండా వెళ్లేవారు ఎవరు మంటలార్పే ప్రయత్నం చేయలేదు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల చుట్టూరా పెరిగిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో రోడ్డు పొడవునా మంటలు అంటుకుంటూ వెళ్లాయి.

మహిళల స్థితిగతులు బాగుపడితేనే సమాజ అభివృద్ధి

● జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళల స్థితిగతులు బాగుపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ అన్నారు. కొమురవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమన్నారు. మహిళా సాధికారతకు తోడ్పాటునందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను సత్కరించారు. ఎంఈవో రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ సమాజానికి తొలి గురువు

గజ్వేల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : అమ్మ సమాజానికి తొలి గురువు అని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్, కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ కుటుంబసభ్యులను క్రమశిక్షణలో ఉంచినట్లయితే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ మెంబర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మిరుదొడ్డి : భూంపల్లిలో కేక్‌ను కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త, కార్మికురాలు

భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో..

మిరుదొడ్డి, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ కార్యకర్తలను, వంట కార్మికులను సన్మానించారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు.

వర్గల్ పాఠశాలలో సన్మానం

వర్గల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు వేడుకలను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు రజని, భాగ్యలక్ష్మి, సరస్వతీ, నాగమణిలను ఉపాధ్యాయ బృందం శాలువాలతో సన్మానించింది. సావిత్రీబాయి పూలే చిత్రపటాన్ని బహూకరించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నాగపురి విద్యార్థి

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌ఎకు చెందిన 9వతరగతి విద్యార్థి తుమ్మ బాలు జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29నుంచి బీహార్ రాష్ట్రంలో జరగనున్న 39వ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలలో తెలంగాణ జట్టు తరఫున పాల్గొననున్నాడు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం అయిలయ్యతో పాటు ఉపాధ్యాయులు బాలును అభినందించారు.


బాలును అభినందిస్తున్న హెచ్ఎం అయిలయ్య


చిన్నకోడూరు పాఠశాలలో స్వయంపాలన దినోత్సవంలో ఏంఈవో యాదవరెడ్డి, ఉపాధ్యాయులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కొండపాక మండలం దమ్మక్కపల్లి, కుకునూరుపల్లి మండలం లకుడారం, దుబ్బాక మండలం రామక్కపేట, తొగుట మండలం తుక్కాపూర్, చిన్నకోడూరు, చేర్యాల మండలం నాగపురి, మద్దూరు మండలంలోని లద్నూరు ప్రాథమిక పాఠశాలల్లో, మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

పాత మున్సిపల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

హుస్నాబాద్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి కరీంనగర్ రోడ్డులోని హుస్నాబాద్ పాత మున్సిపల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలను అందించనున్నారు. మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం ఏర్పాటు చేయడంతో పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయంలోకి మార్చారు.

ప్లాస్టిక్ బాటిళ్ల విక్రయంతో గ్రామ పంచాయతీకి ఆదాయం

మద్దూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి గ్రామపంచాయతీలో సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్ల విక్రయాలతో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్‌ను ఎంపీవో వీర్‌రాజ్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడారు తడిపొడి చెత్తలో భాగంగా సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లను గ్రామానికి చెందిన గొట్టం శ్రీనివాస్‌రెడ్డికి విక్రయించినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని గ్రామపంచాయతీ ఖాతకు జమచేయనున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఆలోచనలతో పంచాయతీల అభివృద్ధి బాట పడుతాయన్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

రాయపోల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లిలో శనివారం నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. శనివారం ఉదయం ఆలయ ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, అంకురారోపణ, అన్నపూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో రోజు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఉమామహేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడో రోజు సోమవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండం తొక్కిన అనంతరం స్వామివారి విమాన రథోత్సవం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు.


వడ్డెపల్లిలో వెలసిన వీరభద్రస్వామి

తక్షణమే హాస్టల్‌ను ప్రారంభించండి

ధూళిమిట్ట, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎస్సీ బాలుర హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎవరు లేని హాస్టల్‌కు వాచ్‌మన్‌ను పెట్టి కాలయాపన చేయడం తగదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.